క్లుప్తంగా

ఉదయభానును కలిసిన డీపీవో జయచంద్ర



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తూ జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా ఉద్యోగోన్నతి పొందిన టీఎస్ జయచంద్రగాంధీ గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఉదయభాను జయచంద్రకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, న్యాయవాది బూడిద నరసింహారావు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



కెఅగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ అమ్మవారితో పాటు సహ దేవతలు ఊరి ముత్యాలమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం గురువారం కనులపండువగా జరిగింది. అర్చకుడు మార్తి రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకుడు జొన్నబొట్ల కిషోర్‌శర్మ పర్యవేక్షణలో యంత్ర స్థాపన, కళాన్యాసం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలతో గ్రామస్తుల సమక్షంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామస్తులు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రతిష్టా మహోత్సవాలలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామికి గురువారం ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు జ్యేష్ఠ అభిషేకం, లక్ష తులసి పూజ, లక్ష మల్లెపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, ఆలయ ఏసీ ప్రసాద్, చైర్మన్ రాధా సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

జి.కొండూరు: మండలంలోని కవులూరు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం డీఎల్‌డీఏ ఉప సంచాలకులు డాక్టర్ కె శ్రీనివాసులు, మైలవరం ఏడీ హరిహరనాథ్, పశు వైద్యాధికారి డాక్టర్ కె మౌనిక పర్యవేక్షించారు. ఈ ప్రదర్శనలో భాగంగా పెయ్యదూడల ఆరోగ్య, అందాల విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన లేగ దూడల యజమానులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. అనంతరం పశుబీమాపథకం, పెయ్యదూడలు పుట్టే పథకం, జాతీయ కృత్రి గర్భోత్పత్తి ద్వారా ఉచిత వీర్య పథకం, దూడల సంరక్షణపై డిఎల్‌డిఎ ఉప సంచాలకులు శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా మరియమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొట్టిముక్కల ఓంకార్‌బాబు, వైస్ ఎంపీపీ ఈలప్రోలు తేజశ్విని, వైస్ సర్పంచ్ బొర్రా నరేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్టాపన పూజలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతా లక్ష్మణ హనుమాన్ సమేత కోదండ రామస్వామి ఆలయ విగ్రహ, విమాన గోపుర, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోడేపూడి అప్పారావు నూతన ఆలయం నిర్మించారు. ఈ నెల 12వ తేదీన జరిగే విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ఈ నెల 9వ తేదీ నుంచి విశేష పూజలు, యాగశాల ప్రవేశం, కుంభారాధన, నిత్యపూర్ణాహుతి, హోమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్టా మహోత్సవం విజయవంతం చేయాలని వారు కోరారు.

తిరుపతమ్మ తల్లి దయతో...

- అమ్మ సన్నిధిలో డప్పు కళాకారులకు ఉపాధి
- సొంత గ్రామంలోనే యువకులకు లభిస్తున్న పని
- హాయిగా జీవనం సాగిస్తున్న దాదాపు 200 కుటుంబాలు



ఆలయం వద్ద డప్పులు కొడుతున్న కళాకారులు

పెనుగంచిప్రోలు: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి సన్నిధిలో డప్పు కళాకారులు ఉపాధి పొందుతూ తమ కుటుంబాలతో హాయిగా జీవనం సాగిస్తున్నారు. అమ్మవారికి భక్తులు పాలు, పొంగళ్లు సమర్పించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. పొంగళ్ల ముందు డప్పులు కొడుతూ చిందులు వేస్తూ ఆలయం చుట్టూ తిరగటం ఆనవాయితీ. భక్తులు ప్రదక్షిణలు చేసే సమయంలో ఒక్కో చుట్టుకు ఇంత అని డప్పు కళాకారులు డబ్బులు వసూలు చేస్తారు. గ్రామంలో సుమారుగా 100 కుటుంబాల వారు ఈ డప్పులు కొట్టే పనిలో ఉండగా, చుట్టు పక్కల గ్రామాల వారు మరో 100 మంది ఉంటారు. అంటే దాదాపుగా 200 మంది కళాకారులకు ఆలయం వద్ద పని దొరుకుతోంది. శుక్ర,ఆదివారాల్లో, ఇతర ఉత్సవాల సమయంలో డప్పు కళాకారులకు డిమాండ్ మరింతగా ఉంటుంది.

విద్యావంతులు సైతం

ఉపాధి కోసం ఉన్న ఊరు వదిలి ఎక్కడో దూర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరం లేకుండా ఉన్న ఊళ్లోనే డప్పు కళాకారులకు కుటుంబ జీవనానికి సరిపడా ఉపాధి దొరుకుతోంది. దీంతో కొందరు చదువుకున్న యువకులు కూడా దీనినే ఉపాధిగా ఎంచుకున్నారు. భక్తులు డప్పు మోతలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ, చిందులు వేస్తూ ఆలయం వద్ద చేసే సందడి అంతాఇంతా ఉండదు. ఎక్కడ ఉపాధి లేకున్నా పెనుగంచిప్రోలు డప్పు కళాకారులకు మాత్రం నిత్యం డప్పులు కొట్టే పని ఉంటుంది.ఉపాధి దొరుకుతుంది.

అమ్మ సన్నిధిలో హాయిగా ఉంటున్నాం



శ్రీతిరుపతమ్మవారి సన్నిధిలో డప్పులు కొడుతూ, సంపాదించుకుంటూ హాయిగా జీవిస్తున్నాం. భక్తులు ఇచ్చే డబ్బులతో జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఉన్నాం. చదువుకుని ఖాళీగా లేకుండా కొందరు డప్పులు కొడుతూ ఉపాధి పొందుతున్నారు.

–జి పుల్లయ్య

గ్రామంలో 100 మంది వరకు కళాకారులు ఉన్నారు



అమ్మవారికి పాలు, పొంగళ్లతో భక్తులు కుండను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణలు చేస్తారు. వారి ముందు డప్పులు కొడుతుండగా, భక్తులు నృత్యాలు చేయటం ఆనవాయితీ. గ్రామంలో 100 మంది వరకు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. అమ్మ సన్నిధి ఎంతోమందికి జీవనానికి తోడ్పడుతోంది.

–చంటి

గ్రంథాలయాలతో విజ్ఞానం



అనిగండ్లపాడులో బహుమతులు అందుకున్న విద్యార్థులు



వైద్యుల వేషధారణలో విద్యార్థినులు

పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి విజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం గ్రంథాలయాల్లో విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వాక్యాలు చెప్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్ద కందిమళ్ల ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహించారు. ముందుగా ప్రపంచ సముద్ర దినోత్సవం, బ్రెయిన్ ట్యూమర్స్ డే నిర్వహించి వాటి గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్, ఎం.కనకారావు, కవి నీలం సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విచిత్ర వేషధారణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి, డాక్టర్, టీచర్‌గా విచిత్ర వేషధారణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.నాగేశ్వరరావు, వినోద్‌కుమార్, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది రమేష్, బీడీసీ మల్లిక పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట

మక్కపేట(వత్సవాయి): నూతన నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్టా మహోత్సవం గురువారం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా ప్రతిష్టా మహోత్సవాలకు సంబంధించి పూజా కార్యక్రమాలను శివాచార్య యలమంచి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఉదయభాను బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7.42 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గ్రామపెద్ద కాపు మల్లెల గాంధీ దంపతులు బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడింది. అన్నదానాన్ని నిర్వహించారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా ఎస్‌ఐ బి.అభిమన్యు బందోబస్తు నిర్వహించారు.

11న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ పంచాయతీ పరిధిలోని ఆదర్శ పాఠశాల నందు ఆరో తరగతిలో చేరేందుకు ఈనెల 11వ తేదీన(ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహించడం జరుగుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ వీరరాజు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేర్చుకునేందుకు విద్యార్థులందరూ తప్పక హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు సెంటర్‌కు చేరుకోవాలని, పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు ఫిష్ ఆంధ్రా మార్కెట్‌కు శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: స్థానిక ఫెర్రీ గ్రామంలో చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారుల కోరిక మేరకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్ర మార్కెట్ సముదాయానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేస్తారని సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహన రావు గురువారం తెలిపారు. మత్స్యకార కుటుంబాల సభ్యులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్రమబద్ధీకరించడం మంచి నిర్ణయం

మైలవరం: కాంట్రాక్ట్ ఉద్యోగులు 2014 ముందు ఉన్న వారిని క్రమబద్ధీకరించడం, సీపీఎస్ రద్దు చేసి వీలైనంత ఎక్కువ మేలు జరిగే విధంగా జీపీఎస్ విధానం తీసుకురావడం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షకార్యదర్శులు పీ. గోపాల్, ఎం. వెంకటేష్‌లు గురువారం తెలిపారు. కొత్త పీఆర్సీ కమిటీ వేయడం చాలా శుభ పరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అభినందనలు తెలిపారు. ముదిరిన ఎండలు పరిగణలోకి తీసుకుని పాఠశాలల పునఃప్రారంభాన్ని జూన్25వ తేదీకి మార్చాలని కోరారు.

కంచికచర్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు
- రూ.24 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



కంచికచర్ల పాత శివాలయం వద్ద డ్రైనేజీ అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: కంచికచర్ల పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వం ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని నందిగామ శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక పాత శివాలయం సమీపంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీని అభివృద్ధి చేసేందుకు గురువారం కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంచికచర్ల పట్టణంలో గత నాలుగేళ్ల నుంచి ఎంతో అభివృద్ధి చేశామని, ఇటీవల రూ.90.5లక్షలతో ఇళ్లపై సరఫరా అవుతున్న 33 కేవీ విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రూ.18కోట్లతో కంచికచర్ల నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామం వీరులపాడు మండలం పెద్దాపురం వరకు వెడల్పుతారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వసంతకాలనీ, ఇందిరా కాలనీ, మోడల్ కాలనీ, ప్రణీత కాలనీ, హనుమాన్ పేట తదితర కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. మండల పరిషత్ నుంచి మంజూరయిన మరో రూ.4లక్షలతో పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు బండారుపల్లి నాగ పుష్పలీల, మాడుగుల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు, పాలక మండలి సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. దుర్గాఘాట్ అభివృద్ధి పనుల్లో భాగంగా స్నానఘాట్‌లో చేపట్టిన పూడికతీత పనులను గురువారం చైర్మన్, పాలక మండలి సభ్యులు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఘాట్‌లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదుల నిర్మాణంతో పాటు క్లోక్‌రూమ్‌లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్నానఘాట్‌లో నుంచి తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించాలని ఆదేశించారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, బచ్చు మాధవీకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్, పంట కాలువ రోడ్డు, బందరు రోడ్డుతో పాటు విజయలక్ష్మీకాలనీ పరిధిలోని అన్ని విద్యుత్ సర్వీస్‌లను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు మాట్లాడుతూ.. 2,353 సర్వీస్‌లను తనిఖీ చేశామన్నారు. ఇందుకుగాను 82 కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇందులో కమర్షియల్ 320, గృహ వినియోగ సరీ్వస్‌లు 2,033 సర్వీస్‌లను తనిఖీ చేశామన్నారు. వినియోగదారుల నుంచి రూ.3.52 లక్షల జరిమానా విధించామని చెప్పారు. తనిఖీల్లో 33 బృందాలు పాల్గొన్నాయన్నారు. అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక లోడు వినియోగంపై సంబంధిత ఏఈలను కలిసి.. దానికి సంబంధించిన డీడీలను తీసిన తర్వాతనే విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. అధిక విద్యుత్ లోడు వాడితే శాఖాపరమైన చర్యలతో పాటు సర్వీస్‌ను రద్దు చేస్తామన్నారు.

యథావిధిగా మొదలైన తాగునీటి సరఫరా

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: హెడ్ వాటర్ వర్క్స్‌లో మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం ద్వారా యథావిధిగా పట్టణ ప్రజలకు గురువారం నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజులుగా హెడ్ వాటర్ వర్క్స్‌లో పైపులైన్ లీకేజీ, వాల్వ్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తిచేయించినట్లు తెలిపారు. చెప్పిన సమయం కన్నా ముందుగానే మరమ్మతులు పూర్తి చేసినందుకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావుకు, ఇంజనీరింగ్ సిబ్బందికి చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి సరఫరా అంతరాయానికి సహకరించిన పట్టణ ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

పెనుగంచిప్రోలు: మాట ఇస్తే తప్పక నెరవేరుస్తారని మరొకసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని ఆరోగ్య సిబ్బంది అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపటంతో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న మాట ఇచ్చిన మాట ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయటం జీవితంలో మర్చిపోలేమన్నారు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



పేటలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో కిట్లను పంపిణీ చేసిన ఎంఈఓ రవీంద్ర, స్వీకరించిన హెచ్‌ఎంలు

63 పాఠశాలల్లో 8,116 మంది విద్యార్థులకు సిద్ధం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం గురువారంతో ముగిసినట్లు ఎంఈవో డి.రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ నుంచి మండలంలో ఉన్న 63 పాఠశాలలకు పంపిణీ చేశారు. గత వారం రోజుల నుంచి 15 మంది మండల రిసోర్స్ సిబ్బంది ద్వారా పట్టణంతో పాటు వివిధ గ్రామాలలోని పాఠశాలల హెచ్‌ఎంలకు కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, 1 స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, రెండు జతల సాక్సులు, బెల్టులు, 1, 6 వ తరగతిలో చేరిన విద్యార్థులకు డిక్షనరీలు మండలంలోని మొత్తం 8,116 మంది విద్యార్థులకు నాణ్యతతో కూడిన కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

12 న పాఠశాలల పునః ప్రారంభం రోజు పంపిణీ చేయాలి

జగనన్న విద్యా కానుక కిట్లను ఈనెల 12 వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం రోజున అన్ని పాఠశాలల్లో ఆయా గ్రామాలు, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు, పాఠశాలల కమిటీలు, గ్రామ పెద్దలను ఆహ్వానించి వారి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయాలని ఎంఈవో రవీంద్ర తెలిపారు. విద్యార్థులకు బయో మెట్రిక్ హాజరు వేయించాలన్నారు.

లాభసాటిగా వ్యవసాయ రంగం



బోరు పనుల ప్రారంభంలో సర్పంచ్ తదితరులు

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో వ్యవసాయ రంగం లాభసాటిగా సాగుతోందని సర్పంచ్ నక్కా కమల అన్నారు. వైఎస్సార్ జలకళలో భాగంగా రైతుల పొలాల్లో బోర్లు వేసే కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలనలో రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతోందన్నారు. రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనం నుంచి విక్రయం ద్వారా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బారు సుధారాణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోపూరి రామకోటేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



తాటిగుమ్మిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

తాటిగుమ్మి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తుండటంతో పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళా సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతినివ్వటంతో పాటు ప్రతి ఒక్క సంక్షేమ పథకంలోను మహిళలను భాగస్వాములను చేస్తున్నారని చెప్పారు. ప్రజలకుమంచి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పలకా మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకులు రాఘవరెడ్డి, కుంపటి శ్రీను, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నందిగామ: రాత్రి సమయంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పౌరసరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ రామ్మూర్తి రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం చందర్లపాడు ప్రాంతం నుంచి ఆటోలో 50 మూటలు (సుమారు 25 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి సమయంలో చందర్లపాడుకు చెందిన ఓ వ్యాపారి వేరే ప్రాంతానికి తరలిస్తున్నాడు. సమాచారం రావడంతో విజిలెన్స్ సీఐ వసంత బాబు తమ సిబ్బందితో వచ్చి చందర్లపాడు మండలం తుర్లపాడు రోడ్డులో ఆటోను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని ఆటోను చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు డీటీ రామ్మూర్తి రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణంలో ఉన్న మూడు సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలన్నింటిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.